క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

డెంకాడ(పూసపాటిరేగ): ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా తమ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని పూసపాటిరేగ మండల వ్యవసాయాధికారి కె.నీలిమ అన్నారు. మండలంలోని పేరాపురం గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదును బుధవారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించాలన్నా, పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్ వంటివి పొందేందుకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని అన్నారు. పేరాపురం గ్రామంలో 150 ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగులో ఉండగా, ఇంతవరకు 102 ఎకరాల్లో పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు

భోగాపురం: సాగర కవచం కార్యక్రమంలో భాగంగా బుధవారం పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ప్రధాన కూడళ్ల వద్ద మెరైన్ అడిషనల్ ఎస్పీ బీబీఆర్ ముధుసూదనరావు పర్యవేక్షణలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. వాహనాలతో పాటు అపరిచిత వ్యక్తులను నిశితంగా తనిఖీ చేశారు. ఆధార్ కార్డులను పరిశీలించి ఎక్కడ నుంచి ఎక్కడి వెళ్తున్నారనే సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ముక్కాం, చింతపల్లి తీరంలోని పడవలను పరిశీలించి, వాటిపై వస్తున్న వారి వివరాలను సేకరించారు. అనంతరం మెరైన్ ఏఎస్పీ మాట్లాడుతూ.. సముద్ర మార్గం గుండా వచ్చే చొరబాటుదారులను నిలువరించేందుకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి సాగరకవచం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ వైకుంఠరావు, ఎస్‌హెచ్‌ఓ ఎస్వీ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల పరిశీలన

భోగాపురం: విమానాశ్రయానికి తాగునీరు అందించేందుకు చేట్టాల్సిన పైపులైన్ అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం కోట భోగాపురం రెవెన్యూ పరిధిలోని రైతుల నుంచి సేకరించాల్సిన 33 సెంట్లు భూమిని ఆర్డీఓ ఎంవీ సూర్యకళ బుధవారం పరిశీలించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చంపావతి నది నుంచి తాగునీటిని సరఫరాకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందుకు సంబంధించి పైపులైన్ నిర్మాణ పనులను ఇప్పటికే ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ సూర్యకళ రైతులతో భూసేకరణపై చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విమానాశ్రయ నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, అందుకు తామంతా సహకరిస్తామని అన్నారు. అయితే తమకు సరైన పద్ధతిలో నష్ట పరిహారం చెల్లించాలని ఆర్డీఓను కోరారు. దీనిపై ఆర్డీఓ సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట తహసీల్దార్ సురేష్, సర్పంచ్ గరే మురళీహనరావు ఉన్నారు.

30లోగా వీఎంసీ లోగో..

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ అధికారిక లోగో రూపకల్పనకు నిర్ణయించినట్లు కమిషనర్ నల్లనయ్య బుధవారం తెలిపారు. విజయనగరం చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే విధంగా లోగోను తయారుచేయాలని చిత్రకారులకు సూచించారు. చిత్రకారులు తాము రూపొందించిన వీఎంసీ లోగోను ఈ నెల 30లోగా 9849906486 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు.

ఆపద్బాంధవులు



ముంపు ప్రాంతంలో చిక్కుకుపోయిన డయాలిసిస్ రోగిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న 5వ ఏపీఎస్‌పీ ఎస్‌డీఆర్‌ఎఫ్ పోలీసులు



వరదలో చిక్కుకున్న మహిళను భుజం మీద మోసుకుని వస్తున్న 5వ ఏపీఎస్‌పీ బెటాలియన్ సిబ్బంది



విజయవాడలో వరద బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న 5వ ఏపీఎస్‌పీ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

డెంకాడ: విపత్కర పరిస్థితుల్లో మేము సైతం అంటూ చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ పోలీసులు అందిస్తున్న సేవలను ప్రజలు అభినందిస్తున్నారు. ప్రకృతి విపత్తుల్లో వీరు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలను రక్షించేందుకు శ్రమిస్తున్నారు. గతంలో రాయలసీమ జిల్లాల్లో, తాజాగా విజయవాడలో వరదల్లో చిక్కుకున్న ఎంతో మందిని రక్షించారు. బెటాలియన్ కమాండెంట్ మల్లికాగార్గ్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా విడిపోయి సేవలందిస్తున్నారు. ఒక బృందానికి ఇన్‌చార్జ్‌గా అసిస్టెంట్ కమాండెంట్ లక్ష్మీనారాయణ, మరో బృందానికి ఆర్‌ఐ చంద్రశేఖర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. విజయవాడలో సంభవించిన ప్రకృతి విపత్తులో వీరంతా పాల్గొని 450 నుంచి 500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సృజనాత్మకను వెలికితీసేందుకే 'ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు'

- డీఈఓ ఎన్.ప్రేమకుమార్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ ఎన్.ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల నమోదు కోసం విద్యార్థుల్లో చైతన్యం కలిగించే వాల్ పోస్టర్‌ను డీఈఓ ఎన్.ప్రేమకుమార్ బుధవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాల అయితే మూడు, ఉన్నత పాఠశాల అయితే ఐదు ప్రాజెక్టులను రూపకల్పన చేయాలని సూచించారు. భారత శాస్త్ర,సాంకేతిక విభాగం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు వెలికితీసేందుకు, సామాజిక సమస్యలకు పరిష్కారాలు సూచించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. నూతన ఆలోచనలతో ప్రాజెక్టు రూపకల్పన చేసిన విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు రూ.10 వేలు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఇంతవరకు జిల్లాలో 200 పాఠశాలల నుంచి 850 ప్రాజెక్టులు నమోదైనట్లు చెప్పారు. ఈ నెల 15 లోగా ప్రాజెక్టులను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతి నాయుడు, జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు, ఏడీ శ్రీనివాస్, సూపరింటెండెంట్లు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గరే కనకరాజు(ఫైల్)

భోగాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నందిగాం గ్రామానికి చెందిన గరే కనకరాజు(39), గూడెపువలస గ్రామానికి చెందిన సరగడ రామకాసు భోగాపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు సమీపంలో ఓ దస్తావేజి లేఖరి వద్ద హెల్పర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని స్థానిక మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేశారు. బైక్‌లో పెట్రోల్ కొట్టించేందుకు భోగాపురం సమీపంలోని పెట్రోల్ బంక్‌కు బయలుదేరారు. ఇంతలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే కనకరాజు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు రామకాసును అతని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారు. మృతుడు కనకరాజుకు భార్య అఖిలేశ్వరితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రభాకర్ తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ శంకరరావు మృతి



శంకరరావు(ఫైల్)

విజయనగరం: జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మహాభాష్యం శంకరరావు మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. గత 20 ఏళ్లుగా జర్నలిజం రంగంలో విశేషమైన సేవలందించారు. ఆయన మృతిపట్ల జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులందరూ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేయడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

విజయనగరం పూల్‌బాగ్: ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ముంపు ప్రాంతాల బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలని, సహాయ సహకారాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మానవతా దృక్పథంతో ప్రజలు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఎం నాయకులు బుధవారం విజయనగరం పట్టణంలో విరాళాలు సేకరించారు. వరద బాధితులకు సీపీఎం కార్యకర్తలు ప్రత్యక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని, అలాగే భోజనం, నీరు, పాలు, కనీస అవసరాలు తీర్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి.రమణ, హరీష్, ఆనంద్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: మండలంలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పూడి హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుప్పాడ, చిల్లపేట, రాకోడు, పినవేమలి, సారిక, కోరుకొండ, కోరుకొండపాలేం, కోరుకొండ కొత్తూరు, అట్టాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాగే కలెక్టరేట్ పరిధిలోని పావనీనగర్, అరుంధతినగర్, కాంబోయి వీధి, రెల్లివీధి, గణేష్ కోవెల రోడ్, హోటల్ షాలిమార్, కామాక్షి నగర్, ఖాళీఘాట్ కాలనీ, ఉడాఫేస్-1, మర్రి చెన్నారెడ్డి కాలనీ, సిక్కు కాలనీ, రామ్మయ్యమ్మ కాలనీ, బీసీ కాలనీ, యాతపేట, జర్నలిస్ట్ కాలనీ, రాజులకాలనీ, ద్వారపూడి రోడ్, రెవెన్యూ కాలనీ, బ్యాంకు కాలనీ, సాయికీర్తన నగర్, కామాక్షినగర్, సాయిలలితానగర్, కె.ఎల్.పురం ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి

నెల్లిమర్ల రూరల్: నిత్యావసర ధరలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని సీపీఐ నాయకులు పాపారావు, తవిటినాయుడు, సూరి డిమాండ్ చేశారు. మండలంలోని కొండగుంపాం జంక్షన్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ధరలు మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, రామస్వామి, రామునాయుడు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైమ్: ఒడిశా రాష్ట్రం కంటాభంజి నుంచి చిత్తూరుకు అక్రమంగా తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని రైల్వే జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. కుప్పంకి చెందిన సి.బాలసుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బాలాజీ బుధవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

వితంతు పింఛన్లు మంజూరు చేయాలి

నెల్లిమర్ల: వితంతు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఫించన్ పొందుతూ చనిపోయిన భర్త స్థానంలో వితంతు మహిళలకు పింఛన్లు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా వితంతు పింఛన్లు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. వితంతు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గంజాయి రహిత జిల్లాయే లక్ష్యం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- ఈ ఏడాది ఇప్పటివరకు 49 గంజాయి కేసుల నమోదు: ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: గంజాయి రవాణా, వినియోగాన్ని అరికట్టి విజయనగరాన్ని గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వివిధ శాఖల సమన్వయంతో జిల్లా పోలీస్ శాఖ పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. విద్యా సంస్థల్లో యాంటీడ్రగ్ కమిటీలను వేసి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించాలన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, వివిధ ప్రధాన కూడళ్లలో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చైతన్యం కల్పించాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధక జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయగడ, కోరాపుట్, ఏఎస్ఆర్ జిల్లా రూట్లో తిరిగే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు గంజాయి తరలింపు దారులపై నిఘాపెట్టేలా చూడాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, అటవీశాఖల అధికారులు గంజాయి పంట సాగుపై ఆరా తీయాలని సూచించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో ఇంతవరకు 49 కేసులను నమోదుచేసి 1,109 కేజీల గంజాయిని సీజ్‌చేశామని, 140 మందిని అరెస్టు చేసినట్టు వెల్లడించారు. జిల్లాలో గంజాయి సాగులేదని, సరిహద్దు జిల్లాలైన ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుంచి రవాణా అవుతున్నట్టు వెల్లడించారు. జిల్లాలో డీ అడిక్షన్ కేంద్రం ఉన్నప్పటికీ పనిచేయడం లేదని, వెంటనే దానిని పునరుద్ధరించాలని కలెక్టర్‌ను కోరారు. జీజీహెచ్‌లో 15 బెడ్‌లతో వార్డు ఉందని, సంబంధిత మెడికల్ ఆఫీసర్ ఆరు నెలల కిందటే రిజైన్ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందనస్తూ వెంటనే డీ అడిక్షన్ కేంద్రం అవసరాన్ని తెలుపుతూ ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఉప రవాణా కమిషనర్ మణికుమార్, ఆర్డీఓలు సూర్యకళ, శాంతి, సాయిశ్రీ, డీఎస్పీలు గోవిందరావు, శ్రీనివాసరావు, డీపీఓ శ్రీధర్‌రాజా, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, బాలల సంరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు హిమబిందు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి



కోట వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కోట వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విజయనగరం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ కోసం 2019లో ఎస్ఎఫ్‌ఐ చేసిన పోరాటం ఫలితంగా ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేసిందన్నారు. కళాశాల మంజూరై ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికీ సొంత భవనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలని అధికార పార్టీ నాయకులే వినతి పత్రాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఇది విద్యార్థులను మభ్యపెట్టడమే అని మండిపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వి.చిన్నబాబు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, పి.రమేష్, పట్టణ సహాయ కార్యదర్శి గుణేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చదురుగుడి హుండీ కానుకల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. హుండీ ద్వారా 30 రోజులకు గానూ రూ.10,56,233లు నగదు, 13.800 గ్రాముల బంగారం, 98 గ్రాముల వెండి కానుకలు లభించాయని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. అన్నదానం హుండీలకు సంబంధించి 30 రోజులకు గానూ రూ.9419 నగదు వచ్చిందన్నారు. యూఎస్ డాలర్ 1, మలేషియా రింగిట్లు 50, యూఏఈ దీరామ్స్ 10 చొప్పున విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. వనంగుడి హుండీల ద్వారా 95 రోజులకు గానూ రూ.7,53,247 నగదు, 2.800 గ్రాముల బంగారం, 258 గ్రాముల వెండి లభించిందన్నారు. హుండీల పర్యవేక్షణ ప్రత్యేకాధికారిగా రామతీర్థం ఆలయ సహాయ కమిషనర్ వై.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, శ్రీవారి సేవకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేము సైతం..



వాహనాలను ప్రారభిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం అర్బన్: విజయవాడ వరద బాధితులను ఆదుకొనేందుకు మేము సైతం అంటూ జిల్లా పొదుపు సంఘాల సమైఖ్య ముందుకొచ్చింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచనలతో జిల్లా సమాఖ్య కార్యవర్గం సమావేశమై వరద బాధితుల సహాయార్థం డ్వాక్రా మహిళల తరఫున రూ.10 లక్షలు సీఎం సహాయనిధికి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం విజయవాడ వెళ్లి సీఎం చంద్రబాబును కలిసి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. సీఎంను కలిసిన వారిలో పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.సత్యవతి, కార్యదర్శి పి.జనని, గంట్యాడ సమాఖ్య అధ్యక్షురాలు, తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు 2 లక్షల వాటర్ ప్యాకెట్లు

విజయనగరం అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా నుంచి రెండు లక్షల వాటర్ ప్యాకెట్లతో కూడిన రెండు ట్రక్కులు బుధవారం బయుదేరి వెళ్లాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు జిల్లా తరఫున గ్రామీణ నీటిసరఫరా విభాగం రెండు ట్రక్కులతో వాటర్ ప్యాకెట్లను విజయవాడకు పంపించే ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ కార్యాలయం వద్ద ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్ ట్రక్కులను ప్రారంభించారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచనల మేరకు విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఈ ప్యాకెట్లను అందిస్తామని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ డి.ఉమాశంకర్ చెప్పారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం

డెంకాడ: సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని భోగాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని పెదతాడివాడ, జొన్నాడ, చొల్లంగిపేట, తదితర గ్రామాల్లో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం సీడీపీఓ ఎస్తేరురాణి మాట్లాడుతూ.. మంచి ఆహారంపు అలవాట్లు మంచి ఆరోగ్యాన్నిస్తాయని తెలిపారు. గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

విజయగరగం ఫోర్ట్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పలువురు గర్భిణులకు సీమాంతలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చేవరకు తల్లిపాలు పెట్టాలని సూచించారు. ఆరు నెలలు దాటాక తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని అందించాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి

విజయనగరం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరూ మట్టి విగ్రహాలనే పూజలకు వినియోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర పదార్థాలతో తయారుచేసిన విగ్రహాల వలన పర్యావరణానికి విఘాతం కలుగుతుందని స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు ప్రసాదాల పంపిణీలో ప్లాస్టిక్ నిషేధాన్ని తప్పనిసరిగా అమలుచేయాలని, ప్లాస్టిక్ రహితంగా చవితి వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు.

మట్టి విగ్రహాల పంపిణీ

నెల్లిమర్ల: శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో 1200 సిద్ధి వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేసినట్లు సేవా సమితి కార్యదర్శి జగన్నాథరాజు తెలిపారు. కార్యక్రమంలో రవికుమార్, పీవీఎన్ మూర్తి, ఎస్.సుధ, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

విజయనగరం: సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవీ అన్నారు. గురజాడ స్వగృహంలో వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కుసుమంచి శ్రీదేవి, చల్లపల్లి శ్యామలను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గురజాడ ఇందిర, సత్యలత, గీతారాణి, శ్రేయ, పప్పు విశ్వనాథం పాల్గొన్నారు.

అన్నదానం

విజయనగరం: అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి అన్నారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్‌సీఎస్ వద్ద బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కాండ్రేగుల శేఖర్, ముల్లేటి చిన్నారావు, కనిశెట్టి అమ్మాజీ, పాలవర శెట్టి రూపాదేవి, తదితరులు పాల్గొన్నారు.